సాక్షి నిజామాబాద్

శుక్రవారం, 29, నవంబర్, 2024



గుట్టుగా గుట్టలు స్వాహా

జిల్లాలో మైనింగ్ మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వ్యాపారులకు, అధికారులకు మొరం కాసుల వర్షం కురిపిస్తోంది.

- 8లో ▸



తెలంగాణ శ్రీలంకను..

అవినీతి పాలన, ప్రజల తిరుగుబాటుతో తెలంగాణ శ్రీలంకను తలపిస్తోందని బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి విమర్శించారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.1 /10.4

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్ర కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మంత్రి తుమ్మలను కలిసిన డీసీసీబీ చైర్మన్



సుభాష్‌నగర్ : రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీసీసీబీ చైర్మన్‌లతో కలిసి మంత్రి కలిసిన రమేశ్‌రెడ్డి.. ఆయనకు మొకను బహూకరించారు. ఈనెల 30వ తేదీన మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు పండుగ నిర్వహిస్తున్నందున రాష్ట్ర రైతాంగం, జిల్లా సహకార బ్యాంకుల పక్షాన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు రమేశ్‌రెడ్డి తెలిపారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం విద్యార్థులు, యువత కృషి చేయాలని తెయూ వీసీ యాదగిరిరావు పిలుపునిచ్చారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రూపొందించిన వాల్ పోస్టర్లను గురువారం వీసీ ఆవిష్కరించారు. డ్రగ్స్ వినియోగంతో శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా నష్టం జరగడంతో పాటు ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. గంజాయి, సిగరెట్, అల్ప్రాజోలంతో తయారు చేసిన కల్తీ కల్లుకు బానిసలు కాకూడదన్నారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేస్తామని వీసీ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతకు కమిటీలు



విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యతను పరిశీలించేందుకు పాఠశాలలు, హాస్టళ్లలో ఆహారభద్రత కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా సంస్థల బాధ్యులతోపాటు ఇద్దరు అధికారులు, సిబ్బంది కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు. బియ్యం, వంట సామగ్రి నాణ్యతను పరిశీలించడంతోపాటు భోజనాన్ని కమిటీ సభ్యులు ముందు రుచి చూసిన తరువాతే విద్యార్థులకు అందించనున్నారు. అలాగే మండలాలు, డివిజన్ స్థాయిలో నోడల్ అధికారులను కలెక్టర్ నియమించి పర్యవేక్షించనున్నారు.



గురువారం డిచ్‌పల్లి మండలం రాంపూర్ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో అన్నాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం
- సభ్యులు రుచిచూసిన తరువాతే విద్యార్థులకు వడ్డింపు
- సంబంధిత విభాగం ఇన్‌చార్జీలకే బాధ్యతలు
- బోగస్ ఏజెన్సీలపై చర్యలేవీ..?

నిజామాబాద్‌అర్బన్ : విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆహార భద్రత కమిటీలను నియమించాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఆయా పాఠశాలల, వసతి గృహాల ఇన్‌చార్జీలు ఆహార భద్రత కమిటీలను నిర్వహిస్తారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో కమిటీలు పని చేయనున్నాయి. కమిటీలో హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపాళ్లు, వార్డెన్‌లతోపాటు అదే సంస్థలో పని చేసే మరో ఇద్దరు సిబ్బంది ఉంటారు. అలాగే మండలాలు, డివిజన్‌లతోపాటు జిల్లాస్థాయిలో పర్యవేక్షణ కోసం కలెక్టర్ నోడల్ అధికారులను నియమిస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ పర్యవేక్షణలో ఆహారభద్రత కమిటీలు పని చేయనున్నాయి.

జిల్లాలో విద్యాసంస్థలు

జిల్లాలో మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలు 1039 ఉండగా, 81771 మంది విద్యార్థులు, రాష్ట్ర ప్రభుత్వ విభాగానికి చెందిన 112 పాఠశాల్లో 13,376 మంది, రాష్ట్ర విభాగం ప్రత్యేక విభాగానికి చెందిన ఐదు పాఠశాలల్లో 142 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

పకడ్బందీగా అమలు చేస్తాం

ఆహారభద్రత కమిటీలను పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేస్తామని నిజామాబాద్ సౌత్ ఇన్‌చార్జి ఎంఈవో సాయారెడ్డి అన్నారు. భోజనం రుచి చూసిన తరువాతనే విద్యార్థులకు వడ్డిస్తారన్నారు.

కమిటీల బాధ్యతలు ఇవీ..

- విద్యార్థుల కోసం వంట చేసే ముందు స్టోర్ రూమ్, కిచెన్‌లను తనిఖీ చేయాలి.
- పరిశుభ్రత,భోజనం నాణ్యతను నిర్ధారించాలి.
- ఆహార నాణ్యతను తనిఖీ చేయడంతోపాటు విద్యార్థులకు వడ్డించే ముందు రుచి చూడాలి.
- రోజువారీ ఫొటోలు, వివరాలను రికార్డు చేసి ఉంచాలి.
- మొబైల్ యాప్ అందుబాటులోకి వచ్చే వరకు తేదీ వారీగా ఫొటోలు, వివరాలను తమ వద్ద ఉంచాలి.

బినామీల భరతం పడతారా?

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామంటున్న ఉన్నతాధికారులు బినామీ పేర్లతో భోజన ఏజెన్సీలు నిర్వహిస్తున్న వారిపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

■ నగరంలో ఓ వ్యక్తి తనతోపాటు తన బంధువుల పేర్లపై మొత్తం 23 మధ్యాహ్న భోజన ఏజెన్సీలను దక్కించుకుని ఏళ్లుగా రాజ్యమేలుతున్నాడు. సదరు వ్యక్తి నిర్వహిస్తున్న ఏజెన్సీల పరిధిలో రూ.7కోట్ల 62లక్షల అవినీతి బట్టబయలైంది. దీంతో నాటి ప్రజాప్రతినిధులు ఏజెన్సీ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అప్పటి మంత్రి సహకారంతో తప్పించుకున్న సదరు వ్యక్తి 23 ఏళ్లుగా బినామీ పేర్లతో ఏజెన్సీలను నిర్వహిస్తున్నాడు. తనకు రాజకీయ అండదండలున్నాయని హెచ్ఎంలనే బెదిరించడం గమనార్హం.

■ ఓ మాజీ కార్పొరేటర్ నగరంలోని 345 మంది విద్యార్థులు ఉన్న హై స్కూల్ మధ్యాహ్న భోజన ఏజెన్సీని నడుపుతున్నాడు. గతంలో అనేక ఆరోపణలు రాగా, అప్పటి డీఈవో లింగయ్య రెండు సార్లు ఏజెన్సీ రద్దు చేశారు. ప్రస్తుతం అతగాడే కొనసాగుతుండడం భోజన ఏజెన్సీ నిర్వహణలో లోపాలను ఎత్తిచూపుతోంది.

■ మాజీ డిప్యూటి మేయర్ ఒకరు మూడు పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీలను పొందాడు. ఒకేచోట వంట చేసి ఆయా పాఠశాలలకు పంపిస్తున్నా పట్టించుకునేవారు లేరు. భోజనం నాణ్యతపై హెచ్ఎం ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

■ నిజామాబాద్ అర్బన్‌లో వివిధ పార్టీలకు చెందిన 35 మంది మధ్యాహ్న భోజన ఏజెన్సీలను నిర్వహిస్తుండగా, వీరిలో 22 మంది వరకు గతంలో అధికారంలో ఉన్న ప్రధాన పార్టీకి చెందినవారున్నారు. ఇందులో 8 మంది మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

ఫలితాల కోసం ఎదురుచూపు!

- ఆన్‌లైన్‌లోనే జరిగిన యువజన కాంగ్రెస్ సభ్యత్వం, నామినేషన్లు, ఓటింగ్ ప్రక్రియ
- స్క్రూటినీ ఆలస్యం.. రెండున్నర నెలలుగా తప్పని నిరీక్షణ
- రెండుమూడు రోజుల్లో విడుదల కానున్న ఫలితాలు!

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కాంగ్రెస్ పార్టీలో కీలకమైన యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల కోసం గత రెండున్నర నెలలుగా ఆ పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల్లో నిరంతరం ఉత్సాహంగా ఉంటూ, భావి నాయకులుగా ఎదగాలనుకునే యూత్ కాంగ్రెస్ నాయకులు కీలకమైన పదవుల కోసం పోటీ పడ్డారు. ఈ పదవుల కోసం బరిలో నిలిచేవారు ఆన్‌లైన్‌లోనే నామినేషన్లను దాఖలు చేశారు. అదేవిధంగా సభ్యత్వాలు, ఓటింగ్ ప్రక్రియ సైతం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరిగింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, నియోజకవర్గ అధ్యక్షుడు, మండల అధ్యక్షుడు పదవులకు సంబంధించి ఆన్‌లైన్‌లోనే ఓట్లు వేశారు. సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి వ్యక్తి మొత్తం 6 ఓట్లు వేయాలి. గత జూలై 23న నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఆగస్టు 14 నుంచి సెప్టెంబర్ 14 వరకు సభ్యత్వ నమోదు, ఓటింగ్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో నిర్వహించారు. తరువాత నవంబర్ 15 నుంచి నవంబర్ 21 వరకు స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించారు. స్క్రూటినీ ఆలస్యం కావడంతో పార్టీ శ్రేణులు ఫలితాల ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. అన్ని వ్యవహారాలను, ప్రక్రియను ఢిల్లీలోని పార్టీ ఎన్నికల పర్యవేక్షణ విభాగం పర్యవేక్షించింది. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారికి మాత్రమే యువజన కాంగ్రెస్ సభ్యత్వంతో పాటు పోటీ చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ ఈ ఫలితాల విషయమై ప్రధాన పార్టీ నాయకులు సైతం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

■ నిజామాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం విపుల్‌గౌడ్ (నిజామాబాద్ అర్బన్), అబ్దుల్ అద్నాన్ (నిజామాబాద్ అర్బన్), సాయికిరణ్ (నిజామాబాద్ రూరల్), శ్రీకాంత్ (ఆర్మూర్), నరేష్ (నిజామాబాద్ రూరల్), నాగేంద్రబాబు (బాల్కొండ) పోటీ పడ్డారు. అయితే వయస్సు 35 సంవత్సరాలు పైబడి ఉందన్న కారణంతో నరేష్ అభ్యర్థిత్వాన్ని తిరస్కరించినట్లు తెలిసింది. అదేవిధంగా నాగేంద్రబాబు మీద క్రిమినల్ కేసులు ఉన్నాయనే విషయమై ఫిర్యాదులు వెళ్లడంతో అతని అభ్యర్థిత్వాన్ని సైతం హోల్డ్‌లో పెట్టినట్లు సమాచారం. కాగా జిల్లాలో 40 వేలకు పైగా సభ్యత్వాలు, ఓటింగ్ నమోదైనట్లు అంచనా. ఇదిలా ఉండగా కీలకమైన యువజన కాంగ్రెస్‌లో పనిచేసినవారికి భవిష్యత్తులో పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఉండడంతో ఈ పదవులకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో నియోజకవర్గ, మండల అధ్యక్ష పదవులకు సైతం ఆన్‌లైన్ ఓటింగ్ జరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఎన్నికల్లో పోటీ చేసిన జిల్లా అధ్యక్ష అభ్యర్థులు డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చింది. సీనియర్ కాంగ్రెస్ నాయకులు సైతం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఈ ఫలితాలపై ఆసక్తి, ఉత్కంఠ ఎక్కువగా ఉంది. రెండుమూడు రోజుల్లో ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

నేడు మంత్రి కోమటిరెడ్డి పర్యటన



నిజామాబాద్‌అర్బన్ : రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు ఇందల్వాయి మండలం నల్లవెల్లికి మంత్రి చేరుకుంటారు. అక్కడ రోడ్ల పనులను ప్రారంభించిన అనంతరం ధర్పల్లికి చేరుకుని అక్కడ ధర్పల్లి–ఇందిరానగర్ రోడ్డు పనులకు శంకు స్థాపన చేస్తారు. ధాన్యం కొనుగోళ్లపై మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వినాయక్ నగర్–రాజీవ్‌గాంధీ విగ్రహం రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.

సకాలంలో ధాన్యం డబ్బులు చెల్లించాలి

- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ట్రక్ షీట్లు, ట్యాబ్ ఎంట్రీల నమోదులో జాప్యంపై ఆగ్రహం

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించేలా వెంటవెంటనే టాబ్ ఎంట్రీ చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. వివరాల నమోదులో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. మండలంలోని రాంపూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ట్రక్ షీట్లను తెప్పించుకోవడంలో, టాబ్ ఎంట్రీలు చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని గుర్తించిన కలెక్టర్ కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఖాతాల్లో 48 గంటల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ ఎందుకు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని నిలదీశారు. కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలు తరలించిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ రైస్ మిల్లుల వద్ద తరుగు పేరిట కోతలు విధించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ధాన్యం తరలించిన రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ వెంటనే బిల్లుల చెల్లింపులు జరిగేలా చూస్తామని అన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రభాకర్ తదితరులున్నారు.



రాంపూర్‌లో కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

నాణ్యమైన భోజనం అందించాలి

పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం తయారు చేసి విద్యార్థులకు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హ నుమంతు ఆదేశించారు. రాంపూర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గు రుకుల పాఠశాలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ ను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కూరగాయలు, ఆహార పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ నేలపై ఉంచకుండా స్టీల్ డబ్బాలలో భద్రపర్చాలని, వాటిపై తప్పనిసరిగా మూతలు బిగించాలని, ఏ దశలోనూ ఆహారం కలు షితం కాకుండా అప్రమత్తతో వ్యవహరించాలని ఆదేశించారు. భోజనం వండటానికి ముందే ఆహార పదార్థా నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, కాలం చెల్లిన పదార్థాలు వినియోగించకూడదని హెచ్చరించారు. నాసిరకం బియ్యం, నూనె, ఇతర సరు కులు సరఫరా అయితే వెంటనే తహసీల్దార్ దృష్టికి తేవాలన్నారు.

చిన్నారిని మింగిన డ్రైనేజీ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణం 35వ వార్డు పరిధిలోని రాంనగర్‌లో ఏడు ఫీట్ల లోతైన డ్రైనేజీలో పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందింది.

రాంనగర్‌లో నివసిస్తున్న ఆటో డ్రైవర్ మట్ట ప్రశాంత్, జ్యోతి దంపతుల కూతురు ధన శ్రీ గురువారం ఉదయం ఇంటిముందు ఆడుకుంటూ డ్రైనేజీలో పడిపోయింది. పాప కనపడక పోయేసరికి కుటుంబ సభ్యులు కాలనీ మొత్తం వెతికారు. చివరకు కాలనీవాసులు డ్రైనేజీలో బుడగలు వస్తుండడం గమనించి వెతకగా చిన్నారి మృత దేహం లభ్యమైంది. ఉన్నఫలంగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ధనశ్రీ పెళ్లైన 12 సంవత్సరాలకు జన్మించిన ఏకైక సంతానం కాగా దంపతుల రోదనలు మిన్నంటాయి. అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వచ్చిన మున్సిపల్ అధికారులతో కాలనీవాసులు వాగ్వాదం పెట్టుకున్నారు. కాలనీలో ప్రమాదకరంగా మారిన డ్రైనేజీపై రక్షణ చర్యలు చేపట్టాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పెడచెవిన పెట్టారని ఆరోపించారు. చిన్నారి మృతికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. వెంటనే డ్రైనేజీ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ధనశ్రీ (ఫైల్)



ధనశ్రీ మృతదేహం

నగరంలో మృత్యు కుహరాలు


నిజామాబాద్ సిటీ : ఇందూరు నగరంలోని పలు డ్రైనేజీలు, నాలాలు మృత్యు కుహరాలుగా మారాయి. వర్షాకాలంలోనైతే నాలాల పక్కన నివసించేవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటారు. నాలాలు, డ్రైనేజీలు ఎవరిని మింగేస్తాయోనని భయం భయంగా గడుపుతున్నారు. గతంలో గౌతంనగర్ వద్ద ఓ బాలుడు డ్రైనేజీలో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఆగస్టు 20న ఆర్ ఆర్ చౌరస్తా సమీపంలోని ఆనంద్ నగర్ కాలనీలో అనన్య అనే రెండేళ్ల బాలిక ఆడుకుంటూ వెళ్లి నాలాలో పడిపోయి ప్రాణాలు విడిచింది. అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీలోపడి ఓ యువకుడు మృతి చెందాడు. చంద్రనగర్‌లో సైతం ఓ వ్యక్తి నాలాలో కొట్టుకుపోయి మృతి చెందాడు.

డ్రైనేజీల మీదనే నివాసాలు..

నగరంలోని పలు నాలాలు ఆక్రమణకు గురయ్యాయి. పులాంగ్ వాగుతో పాటు డి–52, డి–57 కెనాల్‌ల మీద పలువురు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. చిన్న చిన్న గదులు నిర్మించారు. బాత్‌రూమ్‌లతోపాటు చిన్నపాటి కిరాణా దుకాణాలు, మటన్, చికెన్, కూరగాయల దుకాణాలు వెలిశాయి. అహ్మద్‌పురా కాలనీ, మాలపల్లి, నిజాంకాలనీ, అంబేద్కర్‌కాలనీ, కెనాల్‌కట్ట వంటి పలు చోట్ల ఆక్రమణలున్నాయి. అయినా బల్దియా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాదాలు నివారించడం లేదు.

బల్దియాను ఆదర్శంగా నిలుపుతాం

- ప్రతి ఉద్యోగి జవాబుదారీగా ఉండాలి
- శానిటేషన్, టౌన్ ప్లానింగ్‌పై దృష్టి సారించాం
- క్షేత్రస్థాయి సిబ్బంది లేకపోవడం పెద్ద సమస్య
- మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్‌ల అద్దెను సవరిస్తాం
- నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా మారుస్తాం
- 'సాక్షి'తో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్



రాష్ట్రంలోనే మూడో అతిపెద్దదైన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యం, టౌన్ ప్లానింగ్ కంట్రోల్ తప్పిందనే విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో దిలీప్‌కుమార్ కమిషనర్‌గా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అన్ని విభాగాలపై దృష్టి సారించిన దిలీప్.. ప్రతి ఉద్యోగి జవాబుదారీగా ఉండాలని, అభివృద్ధి ఒక్కరోజులో జరగదని, క్రమక్రమంగా చేపడుతామంటున్నారు. నిజామాబాద్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతామంటున్న నూతన కమిషనర్ దిలీప్ కుమార్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ..

– నిజామాబాద్ సిటీ

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి : కార్పొరేషన్ పరిధిలో మీరు గుర్తించిన సమస్యలేమిటి?

మున్సిపల్ కమిషనర్ : బాధ్యతలు తీసుకున్న తర్వాత అన్ని విభాగాధిపతులతో రివ్యూ నిర్వహించా. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో చాలా సమస్యలున్నాయి. వాటిపైనే దృష్టి సారించాను. తక్కువ మంది సిబ్బందితో సమర్థవంతమైన పాలన సాధ్యం కాదు. ఉన్నతాధికారులకు వివరించా.

◆ **మొండి బకాయిల వసూళ్లు..**

■ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు పన్ను చెల్లించని సుమారు 3వేల మందిని గుర్తించాం. డిమాండ్ నోటీసులు పంపాం. స్పందించకుంటే చర్యలుంటాయి.

◆ **సమీకృత మార్కెట్‌లు..**

■ బోధన్ బస్టాండ్ సమీపంలో అహ్మద్‌పురా కాలనీలోని మీట్ మార్కెట్ నిర్మాణం పూర్తయినప్పటికీ కోర్టులో కేసు ఉన్నందున ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నాం. పాత ఆర్డీవో కార్యాలయం సమీపంలోని సమీకృతమార్కెట్ పూర్తికావడానికి నిదులు పూర్తిగా లేకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయి. నిదులు మంజూరుకాగానే మార్కెట్ పూర్తి అవుతుంది.

◆ **శానిటేషన్ విభాగం సమస్యలు..**

■ పారిశుధ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది, కాంట్రాక్ట్ సిబ్బంది సంఖ్య ఎక్కువగా ఉంది. రెగ్యులర్ ఉద్యోగులు తక్కువగా ఉన్నారు. హాజరు ఇచ్చి బయటకు వెళ్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. హాజరునమోదులో పక్షపాతం కనిపించింది. రెగ్యులర్‌గా ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు ఆకస్మి తనిఖీలు చేస్తున్నా.

◆ **ఆక్రమణల తొలగింపు..**

■ ఆక్రమణలపై ప్రతిరోజూ ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగిస్తాం. నిజామాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా మారుస్తాం.

◆ **పూర్తిస్థాయి ఎంహెచ్‌వో నియామకం..**

■ ప్రసుత్తం డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షిస్తున్నారు. త్వరలోనే పూర్తిస్థాయి ఎంహెచ్‌వో వస్తారు. అప్పుడే హోటళ్లలో తనిఖీలు, కల్తీ ఆహార పదార్థాల గుర్తింపు, శానిటేషన్ వంద శాతం సాధ్యమవుతుంది.

◆ **అవుట్‌సోర్సింగ్ కార్మికులవేతనాల్లో అక్రమాలు..**

■ అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాల చెల్లింపు హాజరు ఆధారంగా ఉంటుంది. బయోమెట్రిక్ హాజరు ఏర్పాటు చేయడం ద్వారా అవకతకవలు నివారిస్తాం. అనవసర ఉద్యోగులను తొలగిస్తాం.

◆ **మున్సిపల్ వాహనాల మరమ్మతులు..**

■ వాహనాల మరమ్మతుల కోసం ప్రత్యేకంగా గ్యారేజ్‌ఏర్పాటు చేస్తాం. మెకానికల్ ఇంజినీర్‌ను, మెకానిక్‌లను నియమిస్తాం. వాహనాలు ఇక్కడే రిపేర్ చేసేవిధంగా చర్యలు తీసుకుంటాం.

భవన నిర్మాణ అనుమతుల్లో అవినీతి..

టౌన్‌ప్లానింగ్ విభాగంలో 26 మంది సిబ్బంది అవసరం. ప్రస్తుతం ఆరుగురు మాత్రమే ఉన్నారు. అధికారులు లేరు. ఉన్నవారితోనే సర్దుకోవాల్సిన పరిస్థితి ఉంది. క్షేత్రస్థాయి సిబ్బంది లేకపోవడం పెద్ద సమస్య. గతంలో సంగతి తెలియదు. నిబంధనలను పాటిస్తేనే అనుమతులు ఇస్తున్నాం.

◆ **మున్సిపల్ కాంప్లెక్సుల్లో అద్దె సవరణ..**

■ మున్సిపల్ పరిధిలోని కమర్షియల్ కాంప్లెక్స్ గదుల అద్దెను సవరిస్తాం. యజమానులు కూడా సబ్ లీజ్‌కు ఇవ్వడం కుదరదు. వాటిపై కూడా త్వరలోనే దృష్టిసారిస్తాం. దీర్ఘకాలంగా ఉన్నవారిపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

పార్కు స్థలాల ఆక్రమణలు..

పార్కు, 10శాతం స్థలాలు కొన్ని చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. గుర్తింపు కోసం ప్రైవేట్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పజెప్పనున్నాం. గూగుల్ మ్యాప్‌ల ద్వారా ప్రభుత్వ స్థలాలను గుర్తించి కంచె ఏర్పాటు చేసి పరిరక్షిస్తాం.

క్లుప్తంగా

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు



తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ సెమిస్టర్ పరీక్షలు గురువారం మూడో రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ పేర్కొన్నారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, వాగ్దేవి డిగ్రీ కాలేజ్, సీఎస్ఐ డిగ్రీ కాలేజ్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 7931 మందికి 7480 మంది, మధ్యాహ్నం పరీక్షకు 3531 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.

హాకీ టోర్నీ పరిశీలకుడిగా స్వామికుమార్



స్వామికుమార్

నిజామాబాద్ నాగారం: ఎస్‌జీఎఫ్–14 బాల బాలికల రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ఈ నెల 29 నుంచి డిసెంబర్1 వరకు హుజురాబాద్, కరీంనగర్ జిల్లాలో జరుగనున్నాయి. ఈ హాకీ టోర్నీ పరిశీలకుడిగా వర్ని మండలం జాకోర జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు డాక్టర్ స్వామికుమార్ నియమితులయ్యారు. స్వామి నియామకంపై హెచ్ఎఫ్ సెక్రటరీ నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, సీనియర్ హాకీ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి



బాల్కొండ: ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉమెన్స్ సీనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని కబడ్డీ అసోసియేషన్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియంలో జిల్లా జట్టును ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. డిసెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీడీ రాజుకుమార్, మల్లేశ్‌గౌడ్, ముప్కాల్ స్పోర్ట్స్ అథారిటీ సభ్యులు పాల్గొన్నారు.

జేసీబీ పట్టివేత



నస్రుల్లాబాద్: మండలంలోని బొప్పాస్‌పల్లి పరిధిలో ఉన్న అటవీ భూముల్లో మొరం తవ్వకాలు చేపడుతున్న జేసీబీని అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ నరేశ్, బీట్ ఆఫీసర్ రమాకాంత్ అడ్డుకున్నారు. దీంతో జేసీబీని బాన్సువాడ ఫారెస్టు ఆఫీసుకు తీసుకెళ్లకుండా మండల కేంద్రంలోని చెక్ పోస్టు వద్ద జేసీబీ సంబంధీకులు, బొప్పాస్‌పల్లి గ్రామస్తులు కొంత మంది అడ్డుకున్నారు. ప్రభుత్వ పనులకు అధికారులు మొరం అవసరం అనడంతోనే తమ స్వంత భూమిలో జేసీబీ నడుపుతున్నామని అటవీ శాఖ అధికారులతో వాగ్వాదం పెట్టుకున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు, ఎంపీడీవో అనుమతులతో మొరం తవ్వకాలు చేపట్టామన్నారు. జేసీబీని తీసుకెళ్లడానికి వీలు లేదంటూ వాదించారు. దీంతో అటవీ శాఖ అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో రెండు గంటల పాటు పోలీసులు సముదాయించారు. పోలీసులు జేసీబీని అదుపులోకి తీసుకుని సంబంధిత అధికారులతో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని తెలుపడంతో గొడవ సద్దుమణిగింది.

గుట్టుగా గుట్టలు స్వాహా..

- జిల్లావ్యాప్తంగా మొరం అక్రమ తరలింపు
- మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖకు కాసులు కురిపిస్తున్న మొరం దందా
- సిబ్బంది కొరత సాకుతో తనిఖీలను మరిచిన గనులశాఖ
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



జిల్లా కేంద్రంలోని నాగారం శివారులో చేపడుతున్న మొరం తవ్వకాలు(ఫైల్)

సుభాష్‌నగర్: జిల్లాలో మైనింగ్ మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వం లీజులకు అనుమతులు ఇవ్వకపోవడం అటు మాఫియాకు.. ఇటు అధికారులకు వరంగా మారుతోంది. మొరం తరలింపునకు దరఖాస్తులు పెట్టుకున్నా.. నెలల తరబడి వాటికి మోక్షం లభించక పోవడంతో నిబంధనల సాకు చూపుతూ వాటిని బుట్టదాఖలు చేస్తున్నారు. ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో గనుల శాఖ, మండలాల్లో రెవెన్యూ, పోలీసులను మచ్చిక చేసుకుని అక్రమ దందా నడిపిస్తున్నారు. మండలాల్లో మొరం దందా అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. వీటన్నింటిని లెక్కలేసుకుంటున్న మాఫియా వ్యాపారులు టిప్పర్ ధర రూ.4వేలకు అమాంతంగా పెంచేశారు.

జిల్లాలో ఏడు ప్రాంతాల్లో మొరం తరలింపునకు లీజులు (ఐదేళ్లు) మాత్రమే ఉన్నాయి. లీజుల్లో వివిధ కారణాలతో కేవలం మూడు మాత్రమే కొనసాగుతున్నాయి. అదేవిధంగా ప్రభుత్వ అవసరాలు, పనుల నిమిత్తం ఆర్మూర్, రెంజల్, డిచ్‌పల్లి మండలంలో టీపీలు (టెంపరరీ పర్మిట్) ఉన్నాయి. ప్రయివేటు కాంట్రాక్టర్లు, మొరం వ్యాపారులు టీపీల కోసం సుమారు 35 వరకు దరఖాస్తులు పెట్టుకున్నట్లు సమాచారం.

అడ్డుకట్ట వేసేదెవరు..?

జిల్లావ్యాప్తంగా మొరం అక్రమ దందాకు అడ్డుకట్ట వేయకపోగా,కాసుల కక్కుర్తికి మరిగిన రెవెన్యూ అధికారులు, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు నెలకు ఫలానా మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మొరం దందా కొనసాగించాలంటే ముందుగానే అధికారులకు ముడుపులు ముట్టజెప్పాల్సిందే. లేకుంటే తెలిసిన వెంటనే దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ముడుపులు అందితే అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ధర పెంచిన వ్యాపారులు

మొరం దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఒ క్కో టిప్పర్ మొరం ధర కనీసం రూ.4000 నుంచి రూ.4500లకు (దూరం, డిమాండ్‌ను బట్టి) పెంచేశారు. ఏడాది క్రితం రూ.3వేల లోపే ఉన్న ధర ఎందుకు పెంచారని ప్రజలు అడిగితే అధికారులకు మామూళ్లు ఇవ్వాలని బహిరంగంగా చెప్పడం గమనార్హం.

టెండర్లు నిర్వహించాలి

మొరం లీజులు, టీపీలకు అనుమతులు ఇవ్వకపోవడంతో మాఫియా ఇష్టారీతిన గుట్టలను స్వాహా చేస్తోంది. మొరానికి జిల్లా వ్యాప్తంగా డిమాండ్ నెలకొంది. అక్రమంగా తరలించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లల్లో గండి పడుతోంది. మొరం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట పడాలంటే ప్రభుత్వమే మండలానికి రెండు చోట్ల టెండర్లు నిర్వహించాలి. లేకుంటే లీజులు, టీపీల కోసం పెట్టుకున్న దరఖాస్తులకు మోక్షం లభించాలి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపడితే మొరం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

చేతులెత్తేసిన మైనింగ్‌శాఖ

జిల్లాలో మొరం అక్రమ తరలింపును అదుపు చేయడంలో భూగర్భ గనులశాఖది కీలకపాత్ర. కానీ వారు సిబ్బంది కొరత పేరుతో పూర్తిగా తనిఖీలను మర్చిపోయారు. 16 మంది టీఏలు, ఆర్ఐలకుగాను కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. తనిఖీల విషయంలో మైనింగ్ శాఖ పూర్తిగా చేతులెత్తేసింది. వారికి లీజులు, టీపీల యజమానులు, అక్రమంగా తరలించే వారి నుంచి ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. లీజు, టీపీల నుంచి మొరం వ్యాపారులు ఒక పర్మిట్ తీసుకుని, రోజంతా టిప్పర్లలో మొరం తరలిస్తారనేది బహిరంగ రహస్యం. లీజుల్లో నుంచి ఎన్ని క్యూబిక్ మీటర్ల మొరం తరలుతుందో మైనింగ్‌శాఖ వద్ద వివరాలు లేకపోవడం విడ్డూరం.



బాల్కొండ మండలం వరద కాల్వలో..

దేశాయ్‌కి కన్నీటి వీడ్కోలు



శివరాజ్ దేశాయ్ మృతదేహం వద్ద కన్నీరు పెడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

రుద్రూర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోటగిరి మాజీ జడ్పీటీసీ, బోధన్ సీడీసీ చైర్మన్ శివరాజు దేశాయ్, ఆయన కుమారుడు రాజు దేశాయ్‌కి గురువారం అశ్రునయనాల మధ్య ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. శివరాజు దేశాయ్ కడసారి చూపు కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కోటగిరి మండలం బస్వాపూర్‌కు తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, జుక్కల్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యేలు ఎస్ గంగారాం, యెండల లక్ష్మీనారాయణలు శివరాజు దేశాయ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అంత్యక్రియలకు మాజీ జెడ్పీటీసీలు పుప్పాల శంకర్, అంబర్ సింగ్, శంకర్ పటేల్, మాజీ ఎంపీపీ గంధపు పవన్ కుమార్, ఎలమంచిలి శ్రీనివాస్ రావు, గంగాధర్ పటేల్, కొట్టం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ప్రతాప్ సింగ్ బుధవారం రాత్రి పెర్కిట్ బైపాస్ రోడ్డులో మృతి చెందారు. గురువారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామమైన ఫకీరాబాద్‌లో జరిగాయి. అంత్యక్రియల్లో ఏసీపీ(ఏఆర్)నాగయ్య, ఆర్ఐ అడ్మిన్ సతీశ్, ఆర్ఐ తిరుపతి, పోలీస్ అసోషియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని శంకర్‌భవన్ స్కూల్‌లో డాక్టర్ శ్రీను నాయక్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు చేసి అవసరమైన టూత్‌పేస్టులు, బ్రష్‌లు ఉచితంగా అందజేశారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల నిధుల వ్యవహారంపై విచారణ



మాట్లాడుతున్న మెప్మా సిబ్బంది

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని కొన్ని డ్వాక్రా సంఘ సభ్యుల నిధుల్లో అవకతకవలు జరిగినట్లు మెప్మా పీడీకి ఇటీవల ఫిర్యాదులు వచ్చాయి. వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని పీడీ రాజేందర్ మెప్మా సిబ్బందిని ఆదేశించారు. దీంతో గురువారం నాందేవ్‌వాడలో డ్వాక్రా గ్రూపు సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సభ్యుల అభిప్రాయం సేకరించారు. సభ్యులు ఎవరికి డబ్బులిచ్చారని అడిగి తెలుసుకున్నారు. ఇదివరకు ఆర్పీగా ఉన్న మాధురి వివరణ తీసుకున్నారు. వాస్తవాలను పీడీ రాజేందర్‌కు సమర్పిస్తామన్నారు. అధికారికంగా మెప్మా పీడీనే వెల్లడిస్తారని తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు అవకాశం

నిజామాబాద్‌అర్బన్: ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రత్యేక అవకాశం కల్పించినట్లు డీఈవో అశోక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు డిసెంబర్ 2 నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి

- జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి



మాట్లాడుతున్న స్రవంతి

బోధన్: క్రీడా స్ఫూర్తిని చాటేలా కలిసి మెలిసి ఆటలు ఆడి ప్రతిభను కనబర్చాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు రెండు రోజులు పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించేలా పోటీ పడాలన్నారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. జిల్లాలోని 33 మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్‌కు చెందిన విద్యార్థులు క్రీడా పోటీలకు సుమారు 500 మంది తరలివచ్చారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ పోటీలకు జూనియర్, సీనియర్ విభాగంలో 80 జట్లు తలపడుతున్నాయని అధికారులు తెలిపారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్స్ నర్సయ్య, గంగాధర్, ఫిజికల్ డైరెక్టర్ సంగీతరావు, హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్‌ను విజయవంతం చేయాలి

డీఈవో అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో డిసెంబర్ 6, 7వ తేదీల్లో నిర్వహించే జిల్లాస్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని డీఈవో అశోక్ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. డీఈవో హాజరై మాట్లాడారు. జిల్లాకు ఇన్‌స్పైర్ అవార్డ్స్ 126 మంజూరయ్యాయని, వీటికి సంబంధించి విద్యార్థులు వారి గైడ్ టీచర్ల సాయంతో ఈ రెండు రోజుల ప్రదర్శనలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సారి సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే ప్రధాన అంశంలో ఏడు ఉప అంశాలు ఉంటాయన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, ఎంఈవోలు సేవ్లా, సాయి రెడ్డి, ఆర్వీఎస్ గౌడ్, సీతయ్య, వాసుదేవరావు గంగాధర్, మంజూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సును అడ్డుకున్న గ్రామస్తులు



తగిలేపల్లిలో బస్సును ఆపేసిన గ్రామస్తులు

వర్ని: మండల కేంద్రం నుంచి తగిలేపల్లి, అంబం, రుద్రూర్ మీదుగా బోధన్ వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు ఆలస్యంగా రావడంపై తగిలేపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి బస్సును నిలిపివేశారు. ప్రతిరోజు నాలుగున్నరకు రావాల్సిన బస్సు 7 గంటల తర్వాత వస్తోందని ఆరోపిస్తూ గురువారం రాత్రి గ్రామానికి వచ్చిన బస్సును గ్రామస్తులు అడ్డుకున్నారు. మూడు నెలలుగా సమయపాలన పాటించకుండా ఆలస్యంగా బస్సు నడుపుతున్నారని దీంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బోధన్ డిపో మేనేజర్ గ్రామానికి వచ్చి సమయానికి బస్సు నడుపుతామని హామీ ఇస్తేనే బస్సులను వదిలివేస్తామని గ్రామస్తులు భీష్మించుకు కూర్చున్నారు. రేపటి నుంచి సమయానికి బస్సును నడుపుతామని బోధన్ డిపో మేనేజర్ శ్రీనివాస్ ఫోన్‌లో హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా సీనియర్ జడ్జి పద్మావతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక తెలంగాణ జిల్లా కమిటీ సభ్యులు చెకుముకి సైన్స్ సంబురాలు, జిల్లా స్థాయి సైన్స్ టెస్టు గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సీనియర్ జడ్జి పద్మావతి, ప్రొఫెసర్ పున్నయ్య, చెలిమెల రాజేశ్వర్, శ్రీహరి ఆచార్య హాజరై మాట్లాడారు. సైన్స్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పులి జైపాల్, చెలిమెల పద్మ, కె పండరి, హెచ్ఎం భాస్కర్, నీరజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు.. ఒకరికి గాయాలు



గాయపడిన ప్యాలాల్

వర్ని: మండలంలోని జలాల్‌పూర్ శివారులో బైక్‌ను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పులిక్యాంప్ గ్రామానికి చెందిన ప్యాలాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పులి క్యాంప్‌నకు చెందిన ప్యాలాల్ గురువారం జలాల్‌పూర్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా బడా పహాడ్ నుంచి జలాల్‌పూర్ వైపు వస్తున్న నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొన్నది. ప్రమాదంలో బాధితుడికి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. వర్ని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

రామారెడ్డి: బాలికను ప్రేమించి, పెళ్లిచేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన మరుకంటి రాజ్‌కుమార్ ఓ బాలికను ఏడాది నుంచి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. మైనర్ బాలిక ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంజీవరెడ్డి కాలనీలో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగవ టౌన్ పీఎస్ పరిధిలోని సంజీవరెడ్డికాలనీలో శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు గంగస్థాన్ ఫేస్–2 కు ఉదయం 10:30 గంటల ప్రాంతంలో వెళ్లి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువాను ధ్వంసం చేసి ఆరు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత



ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలో కిలో వంద గ్రాముల ఎండు గంజాయి పట్టుబడినట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. సీఐ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి వద్ద ఉదయం 11 గంటలకు వాహనాల తనిఖీ చేస్తుండగా పెర్కిట్‌కు చెందిన మహ్మద్ వాహిద్ అనే వ్యక్తి వద్ద కిలో వంద గ్రాముల ఎండు గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుడు మహారాష్ట్ర నుంచి గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గంజాయి, బైక్, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. తనిఖీలో సిబ్బంది చంద్రమౌళి, సందీప్, శ్రీనివాస్, సాగర్, గంగాధర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నిజాంసాగర్: మండల శివారులోని బంజేపల్లిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్

తొగరి కాయ కోసం వెళ్లి మృత్యు ఒడికి..

- పొలానికి వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి
- రెండు కుటుంబాల్లో విషాదఛాయలు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నరేశ్



మేకల వంశీ(ఫైల్)



మేకల కార్తిక్(ఫైల్)

బిచ్కుంద: చేనులో కాసిన తొగరి కాయ కోసం వెళ్లిన ఇద్దరి యువకులను మృత్యువు కబళించింది. రోడ్డు ప్రమాదంలో వారిని కాటేసి ఇరు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. బిచ్కుంద మండలంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నాదమ్ముళ్లు మృతి చెందారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. బిచ్కుంద మండలం పెద్ద తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన మేకల కార్తిక్(25), మేకల వంశి(20) అనే ఇద్దరు ఒకే కుటుంబానికి చెందిన చిన్ననాన్న, పెద్దనాన్న అన్నాదమ్ముళ్లు. కార్తిక్‌కు 9 నెలల క్రితం వివాహం కాగా భార్య గర్భిణీగా ఉంది. తనకున్న వ్యవసాయ భూములను కౌలుకు ఇచ్చి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. పిట్లంలో ఇటీవల బంధువుల పెళ్లి కోసమని ఇంటికి వచ్చాడు. మేకల వంశీ కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామంలోనే వ్యవసాయ పనులు చేస్తున్నాడు. కార్తిక్, వంశీ గురువారం సాయంత్రం తమ పొలానికి కాసిన తొగరిని తెంపేందుకు బైక్‌పై చేనుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా కౌలాస్‌గేట్ ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో వీరు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఐ నరేశ్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు జుక్కల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సాయిబాబా(ఫైల్)

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని కొనతండా వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పిట్ల సాయిబాబా(30) అనే వ్యక్తి మృతి చెందాడు. గాలిపూర్ గ్రామానికి చెందిన సాయిబాబా స్కూటీపై కొత్తబాదికి వెళ్తున్నాడు. బాన్సువాడ-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున స్కూటీని ఏదైనా వాహనం ఢీకొన్నదా లేదా వాహనం పల్టీ కొట్టి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడ అన్న విషయం తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.